

చీనీ టన్ను రూ.43,500

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.43,500 పలికాయి.



అధికారులే టో(తో)లు తీశారు

అద్దె బస్సులతో రూ. కోట్లలో నష్టం వస్తుందని తెలిసినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సంస్థ ఖజానాకు గండికొడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.6°/23.9°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశంమేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

శ్రీగంధం అలంకరణలో నెట్టికంటుడు



గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారు మంగళవారం శ్రీగంధం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేకువ జామునే స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. శ్రీగంధం అలంకరణలో తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ యాగశాలలో సుందరకాండ, మన్యుసూక్త వేద పారాయణం, శ్రీరామ ఆంజనేయ మూలమంత్ర అనుష్టానాల అనంతరం మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని ఆలయ ముఖ మండపంలో కొలువుదీర్చి సింధూరంతో లక్షార్చన చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరగాలి

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరం మారుతి నగర్‌లోని కేశవరెడ్డి స్కూల్‌లో సప్లిమెంటరీ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 42 కేంద్రాలు ఏర్పాటు చేశారని, 11,124 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ఆదేశించారు. మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఈఓ ప్రసాద్ బాబు, తహసీల్దార్ హరికుమార్ ఉన్నారు.

టీబీ డ్యాంకు 6,261 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: తుంగభద్ర రిజర్వాయర్‌లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. మంగళవారం నాటికి 6,261 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి నీటి నిల్వ 9 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలోని ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు, శివమొగ్గ, సాగర, శృంగేరి ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరద డ్యాంలోకి వచ్చి చేరుతోంది. మంగళవారం డ్యాంలో 1,633 అడుగులకు గాను 1,587.07 అడుగులకు నీటి మట్టం చేరింది. అవుట్‌ఫ్లో 2,139 క్యూసెక్కులుగా నమోదైంది.

ఏపీ ఐసెట్‌లో 93 శాతం ఉత్తీర్ణత

అనంతపురం: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్-2025 ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 3,026 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 2,781 మంది పరీక్ష రాయగా, 2,590 మంది అర్హత సాధించారు. పురుషులు 1,401 మంది పరీక్షకు దరఖాస్తు చేయగా.. 1,304 మంది (93.08 శాతం), మహిళలు 1376 మంది దరఖాస్తు చేయగా.. 1,286 (94.67 శాతం) మంది అర్హత సాధించారు.

జెడ్పీ సమావేశానికి హాజరుకండి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని సీఈఓ రామచంద్రారెడ్డి సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల కలెక్టర్లు హాజరవుతారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. అలాగే గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలతో రావాలన్నారు. సమావేశానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు.

ధాన్యం.. దైన్యం

రైతులపై చంద్రబాబు సర్కార్‌కు కాసింతైనా కనికరం లేకుండా పోతోంది. వారి పట్ల అంతులేని చులకనభావం ప్రదర్శిస్తోంది. జిల్లాలో అరకొరగా వరిధాన్యం సేకరణ చేపట్టి అంతటితోనే సరిపెట్టింది. దీంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది.



కణేకల్లు వద్ద వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

వరి రైతు ఘోష

- 3,900 మెట్రిక్ టన్నుల సేకరణతో సరిపెట్టిన కూటమి సర్కార్
- మరో 3 వేల టన్నులు కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్
- ఇంకా కల్లాల్లోనే ధాన్యం రాశులు
- అన్నదాతలను భయపెడుతున్న వర్షాలు
- స్పందించని చంద్రబాబు ప్రభుత్వం

రాయదుర్గం: జిల్లావ్యాప్తంగా గత రబీలో 4,528 హెక్టార్లలో వరి పంట సాగైంది. ఇందులో కణేకల్లు, బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాల్లోని హెచ్‌ఎల్‌సీ ఆయకట్టు భూముల్లోనే 3 వేల హెక్టార్లకు పైగా సాగు చేశారు. ఈ క్రమంలో 29,960 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి రావొచ్చని అధికారులు అంచనా వేశారు. అయితే, పంట కోతకొచ్చే ముందు ఈదురుగాలులు, వడగండ్ల వాన కారణంగా పంట దెబ్బతిని కేవలం 18 వేల మెట్రిక్ టన్నులే దిగుబడి వచ్చింది.

3,900 మెట్రిక్ టన్నులతో సరి..

'పండించిన ప్రతి ధాన్యం గింజనూ మద్దతు ధరతో కొంటాం. తడిసిన ధాన్యాన్ని కూడా తీసుకుంటాం' అంటూ సీఎం చంద్రబాబు పలు సభలు, సమావేశాల్లో ప్రగల్భాలు పలికారు. అయితే ఆయన మాటలకు, క్షేత్రస్థాయిలో చేతలకు పొంతనే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం జిల్లాలో ఏడు చోట్ల ఆర్భాటంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. కేవలం 3,900 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణతో సరిపెట్టడమే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలో జిల్లాలో రైతుల వద్ద ఇంకా సుమారు 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. కొందరు దళారులకు అమ్ముకుంటుండగా.. చాలామంది ప్రభుత్వం ఇంకా సేకరిస్తుందేమోననే ఆశతో కల్లాల్లోనే ధాన్యం రాశులను కుప్పపోశారు.

వరుణుడి భయం..

సాధారణంగా మేలో భానుడు భగభగ మండిపోతాడు. అయితే ప్రకృతి మార్పుల కారణంగా కొన్ని రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ఈ క్రమంలో కల్లాల్లో ధాన్యం రాశులున్న అన్నదాతలు కలవరపాటుకు గురవుతున్నారు. కణేకల్లు ప్రాంతంలో ఇటీవల వర్షాలకు ధాన్యం తడిసిపోవడం గమనార్హం. ఇంకా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు అధికారులు చెబుతుండటంతో అన్నదాతల్లో ఆందోళన అధికమవుతోంది. అదనంగా మరో 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా వీలైనంత త్వరగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఇటీవల వర్షాలకు కణేకల్లు మండలం నాగేపల్లి వద్ద తడిసిన వరిధాన్యాన్ని చూపుతున్న రైతులు

ధాన్యం తడిసిపోయింది



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. రూ.లక్షల పెట్టుబడి పెట్టా. ప్రకృతి విపత్తులను దాటి అరకొరగా చేతికందిన పంటను కల్లంలో కుప్పచేసుకునే లోపే కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ ఆపేశారు. అధికారుల్ని అడిగితే టార్గెట్ పూర్తయిందని చెప్పారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కల్లంలో ధాన్యం తడిసి ముద్దయింది. టార్పాలిన్ షీట్లు లేకపోవడంతో మొలకలు కూడా వచ్చాయి. ప్రభుత్వం త్వరగా స్పందించి మరింత ధాన్యం కొనుగోలు చేయాలి.

– ముజంబిల్, కౌలు రైతు, కణేకల్లు

దారుణంగా రైతుల పరిస్థితి



వరి రైతులు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. కంటికి రెప్పలా కాపాడిన పంటలపై ప్రకృతి పగ పడుతోంది. ఈ క్రమంలో అరకొరగా చేతికొచ్చిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వారి వేదన వర్ణనాతీతంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 3,900 మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేస్తే, రైతుల వద్ద మిగిలిపోయిన దాన్ని ఎవరు కొంటారో అధికారులు, పాలకులు సమాధానం చెప్పాలి. మరో 5 వేల మెట్రిక్ టన్నులతో పాటు తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త,రాయదుర్గం

ప్రతిపాదనలు పంపాం



రబీలో లక్ష్యం మేరకు 3,900 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఎలాంటి ఆంక్షలు లేకుండా సేకరించాం. ఎక్కడైనా మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. మరో వెయ్యి మెట్రిక్ టన్నులు సేకరించేలా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఉత్తర్వులు రాగానే కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తాం.

– రమేష్ రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం

రూ.37 లక్షల మెస్ బిల్లులకు లెక్కల్లేవ్

- డీఎంఈకి నివేదించిన విచారణ కమిటీ
- అకౌంటెంట్ వాణిపై ఫిర్యాదు చేయాలని డీఎంఈ ఆదేశం



అనంతపురం మెడికల్: బోధనాస్పత్రిలో వైద్య విద్యార్థుల మెస్ బిల్లులకు సంబంధించి రూ.37 లక్షలకు లెక్కలు సరిగా లేవని విచారణ కమిటీ సభ్యులు డీఎంఈ డాక్టర్ నరసింహంకు తెలియజేశారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలోని లైబ్రరీలో జరిగిన విచారణను డీఎంఈ పరిశీలించారు. విచారణ కమిటీ, వార్డెన్లతో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలలో యూజీ విద్యార్థుల మెస్ బిల్లులు సంబంధిత అకౌంట్ నుంచి కాకుండా వైద్య విద్యార్థుల అకౌంట్ నుంచి అకౌంటెంట్‌కు వెళ్లినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు విచారణకు ఆదేశించారు. డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ సురేష్ తదితరులతో కమిటీ ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టిన కమిటీ సభ్యులు.. నలుగురు విద్యార్థుల వ్యక్తిగత అకౌంట్లకు ఒకరి ఖాతాలో రూ.30 లక్షలు, మరొకరి ఖాతాలో రూ.5 లక్షలు, ఇంకొకరి ఖాతాలో రూ.2 లక్షల వరకు జమ చేసినట్లు, వారి ద్వారా అకౌంటెంట్‌కు వెళ్లినట్లు గుర్తించారు. అందులో రూ.17 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు గోల్‌మాల్ జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ విషయంలో వార్డెన్ డాక్టర్ సుచిత్ర, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ విజయ, తదితరుల పర్యవేక్షణ లోపం ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు నివేదికలో పేర్కొన్నారు. ఈ క్రమంలో అకౌంటెంట్ వాణిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావును డీఎంఈ నరసింహం ఆదేశించారు.

బదిలీల గోలలో విత్తన పంపిణీ ఆలస్యం

- వ్యవసాయ శాఖలో 144 మందికి స్థానచలనం
- విత్తన పంపిణీపై దృష్టి సారించని వైనం



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ముంచుకొస్తున్నా ఇప్పటికీ విత్తన ప్రణాళిక అమలుకు నోచుకోలేదు. విత్తన సేకరణ, విత్తనశుద్ధి, సరఫరా, పంపిణీ చురుగ్గా కొనసాగాల్సివుండగా... ప్రస్తుతానికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈ క్రమంలోనే వ్యవసాయ శాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో విత్తన పంపిణీ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మండల వ్యవసాయాధికారులు (ఎంఏఓలు), వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ) విత్తన పంపిణీలో కీలకం. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) అసిస్టెంట్లు భాగస్వాములు కావాలి. అయితే, ఏఓలు, ఏఈఓలు పెద్ద సంఖ్యలో బదిలీలు అవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖలో అన్ని విభాగాల పరిధిలో ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు ఏకంగా 144 మంది ఉన్నారు. వీరందరికీ తప్పనిసరిగా స్థానచలనం తప్పదు. ఈ క్రమంలో తమనూ బదిలీ చేయాలంటూ మరికొందరు కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో వ్యవసాయశాఖలో భారీ ఎత్తున బదిలీలు జరుగుతున్నాయి.

ఇబ్బందులు తప్పవు..

ఎటూ బదిలీ కాక తప్పదనే ఆలోచనతో చాలా మంది ఏఓలు, ఏఈఓలు విత్తన పంపిణీ ప్రక్రియ బాధ్యతలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. బదిలీల ప్రక్రియ జూన్ 2న ముగియనుండటంతో అంతవరకు విత్తన పంపిణీ ప్రారంభమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు తీసుకున్న తర్వాతనే విత్తన పంపిణీలో భాగస్వాములు అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాడిపత్రి, మడకశిర, ధర్మవరం పెనుకొండ, కదిరి ఏడీఏలతో పాటు 'ఆత్మ' ఏడీఏ కూడా బదిలీ కానున్నారు. 31 మంది ఏఓలు, 78 మంది ఏఈఓలు, మినిస్టీరియల్ స్టాఫ్ 20 మంది మారిపోనున్నారు. బదిలీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున విత్తన పంపిణీ ఆలస్యం కావడంతో పాటు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వ్యవసాయశాఖతో పాటు ఉద్యాన, ఏపీఎంఐపీ, మార్కెటింగ్, పట్టు, పశుసంవర్ధక, మత్స్యశాఖలో కూడా బదిలీల కోలాహలం మొదలైంది. సిఫారసు లేఖల కోసం ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి అనేక మార్గాలు అన్వేషిస్తున్నట్లు తెలిసింది.

టీచర్ల బదిలీలకు వేళాయె

- నేటి నుంచి హెచ్‌ఎంల బదిలీలు



అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, కార్పొరేషన్, మునిసిపాలిటీ యాజమాన్యాల స్కూళ్లల్లో మొత్తం 14,784 మంది హెచ్‌ఎంలు, టీచర్లు పని చేస్తున్నారు. వీరిలో 375 మంది ప్రధానోపాధ్యాయులు, 329 మంది పీఎస్‌హెచ్‌ఎంలు, 6,850 మంది స్కూల్ అసిస్టెంట్లు, 7,230 మంది ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులున్నారు. ముందుగా బుధవారం నుంచి ప్రధానోపాధ్యాయుల బదిలీలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు తెలిపారు. హెచ్‌ఎం పోస్టులు 178 ఖాళీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు మునిసిపాలిటీ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న గ్రేడ్-2 హెచ్‌ఎంలు ఈనెల 31 నాటికి 5 ఏళ్ల సర్వీస్ పూర్తయ్యే వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థన బదిలీ కోరుకునేవారు (ప్రస్తుతం పని చేస్తున్న స్కూల్‌లో రెండేళ్లు పూర్తయి ఉండాలి) కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కఠినంగా ప్లాస్టిక్ నిషేధం అమలు

- కలెక్టర్ వి.వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: "నగర, పట్టణ ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలు చేస్తాం. ప్లాస్టిక్ విక్రయించే వారికి భారీ జరిమానాలు విధిస్తాం. ఇప్పటికే 56 మందికి నోటీసులిచ్చాం" అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించరాదన్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనంలోనే చెత్త వేయాలన్నారు. త్వరలో నగరంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని, వీరు కాలనీల్లో తనిఖీ చేస్తూ చెత్తను బయట పడేస్తున్న వారికి జరిమానా విధిస్తారన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నెల రోజుల పాటు 'యోగాంధ్ర-25' కార్యక్రమాలను బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. తొలి రోజు నగరంలోని ఇండోర్ స్టేడియంలో కార్యక్రమం ఉంటుందన్నారు. యోగాపై పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. యోగాకు సంబంధించి యాప్‌ను అందుబాటులోకి తెస్తామని, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు అందులో రిజిస్టర్ కావాలని సూచించారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ బాలస్వామి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీఎస్‌డీఓ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

వంకలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

వంకలు, వాగులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఆక్రమణలపై మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. నగర పరిధిలోని పండమేరు, తడకలేరు, నడిమివంక, మరువవంక తదితర వంకలు, వాగుల ఆక్రమణలపై సర్వే చేపట్టాలని సర్వే శాఖ అధికారులకు సూచించారు. ఆక్రమణదారుల ఇళ్లకు నోటీసులు అతికించడంతో పాటు చేతికి కూడా ఇవ్వాలని ఆదేశించారు. ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జాయింట్ కలెక్టర్, ఆర్డీఓతో చర్చించాలన్నారు. ఎంత వర్షం వచ్చినా నగర పరిధిలోని అన్ని కాలువల్లోనూ నీరు నిలువకుండా సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. పండమేరు వంక నుంచి అనంతసాగర్ చెరువు వరకూ శుభ్రం చేయించాలన్నారు. అక్కడి నుంచి శింగనమల చెరువుకు నీరు సాఫీగా వెళ్లేందుకు అవరోధాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, ఆర్డీఓ కేశవనాయుడు, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, తహసీల్దార్లు హరికుమార్, మోహన్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సత్తైన్నా.. ఇదేంటన్నా!



- వైద్య,ఆరోగ్యశాఖ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో పరిస్థితి ఘోరం
- వైద్యసేవల్లో రాష్ట్రంలో 25వ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా
- టీకాలు మొదలు పీహెచ్‌సీల వరకూ అన్నింటా అధ్వానమే
- తాజా పరిశీలనలో బయటపడిన డొల్లతనం
- ఇదెక్కడి చోద్యమంటున్న ప్రజానీకం

- నెల రోజుల క్రితం లేపాక్షి సమీపంలోని చెరువు కట్ట వద్ద పొలానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వ్యక్తిని జాతీయ రహదారిపై అతి వేగంగా కారు ఢీకొంది. ప్రమాదంలో బైకుపై వెళ్తున్న వ్యక్తి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు లేపాక్షి పీహెచ్‌సీకి తరలించారు. అయితే, ఆస్పత్రిలో డాక్టర్ లేరు. ఇప్పుడే వెళ్లారని సిబ్బంది తెలిపారు. దీంతో క్షతగాత్రుడిని హుటాహుటిన హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.
- రెండు వారాల క్రితం మడకశిర నుంచి శిరకు వెళ్లే మార్గంలో తెల్లవారుజామున పాదచారిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు గమనించి నీలకంఠాపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి.. మందులు అందుబాటులో లేవని తెలిపారు. దీంతో బాధితుడు మడకశిర వెళ్లి.. మందులు కొనుక్కొన్నాడు. సమయానికి దగ్గర డబ్బు లేకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి.. అప్పు తీసుకుని మందులు కొన్నట్లు బాధితుడు వాపోయాడు. ఈ రెండే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చాలా ఆస్పత్రుల్లో ఇదే దుస్థితి.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆయన రాష్ట్రానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. విచిత్రమేమంటే వైద్య ఆరోగ్య సేవల్లో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా ఆఖరి నుంచి రెండో స్థానంలో ఉంది. దీంతో అమాత్యులతో పాటు ఉన్నతాధికారులు కూడా జిల్లా అధికారులపై సీరియస్ అవుతున్నారు. ప్రభుత్వం ఏమీ చేయకపోతే తామేం చేయగలమని అధికారులు వాపోతున్నారు.

అన్నింటా వెనుకబాటే..

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీ సత్యసాయి జిల్లాలోని ఆస్పత్రుల్లో దుస్థితి నెలకొంది. తాజాగా వెల్లడైన గణాంకాల్లో డొల్లతనం బయటపడింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మొత్తం 12 అంశాలపై మదింపు చేశారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లా 25వ స్థానంలో నిలిచింది. మానసిక వ్యాధుల నియంత్రణ మొదలు చిన్నపిల్లలకు టీకాలు వరకూ అన్నింటా జిల్లా వెనుకబడి ఉన్నట్లు వెల్లడైంది. 12 అంశాల్లో 100 మార్కులకు గాను 69 మార్కులతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో (26వ స్థానం) నిలవగా.. 74.49 మార్కులతో శ్రీ సత్యసాయి జిల్లా 25వ స్థానంతో సరిపెట్టుకుంది. అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పట్టించుకునే దిక్కులేదు. అసాంక్రమిక వ్యాధుల (బీపీ, షుగర్, గుండెపోటు) స్క్రీనింగ్ సరిగా జరగడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు 40 శాతం మందికే అందుతున్నాయి. చివరకు హెల్త్ మిషన్ నుంచి వచ్చే నిధులను కూడా సరిగా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది.



ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో స్త్రీల మరుగుదొడ్డికి తలుపులు లేకపోవడంతో కర్టెన్ వేసిన దృశ్యం

మంత్రి ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో..?

ఉన్నఫళంగా ఎన్నికలకు పది రోజుల ముందు ధర్మవరం నుంచి బీజేపీ తరఫున నామినేషన్ వేసి గెలిచిన సత్యకుమార్ యాదవ్... నియోజకవర్గానికి రావడం అరుదు అని అంటుంటారు అక్కడి జనం. ఇక నియోజకవర్గానికే సరిగా రాని ఆయన జిల్లాకు సంబంధించిన అభివృద్ధి ఏం చూస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి చుట్టపు చూపుగా రావడం, వెళ్లిపోవడం చేస్తుండటంతో నియోజకవర్గంలో పంచాయితీలు, కార్యకర్తల వివాదాలు అన్నీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న హరీష్ చూసుకుంటున్నారు. ఇదిలా ఉంటే శ్రీ సత్యసాయి జిల్లాలోనే కాదు అనంతపురం జిల్లాలోనూ పరిస్థితి ఇలాగే ఉందని సామాన్యులు అభిప్రాయపడుతున్నారు.



ధర్మవరం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి వెళ్లే మార్గం దుస్థితి

శ్రీ సత్యసాయి జిల్లా స్థానం ఇలా

కేటగిరీ	ఎన్ని మార్కులకు	వచ్చిన మార్కులు
మానసిక వ్యాధులు	15	10.01
చైల్డ్‌హెల్త్-టీకాలు	10	8.85
ఫ్యామిలీ ప్లానింగ్	05	1.43
వెల్‌నెస్ సెంటర్లు	10	9.69
బాలస్వాస్థ్య	05	3.40
ఎన్‌సీడీ, సీడీ	10	5.73
అర్బన్‌హెల్త్	10	8.40
నాణ్యతా ప్రమాణాలు	04	1.47
పీహెచ్‌సీల పనితీరు	10	7.23
హెల్త్‌సొసైటీ పనితీరు	05	3.47

క్లుప్తంగా

ఆర్టీసీ అధికారులపై కలెక్టర్ సీరియస్



ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం క్రైం: కలెక్టర్ వినోద్‌కుమార్ ఎట్టకేలకు స్పందించారు. ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు డిపో, పరిసరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి సమస్యనూ అడిగి తెలుసుకుని ఏళ్ల తరబడి పట్టించుకోకుండా అలాగే ఎందుకు వదిలేశారంటూ సంస్థ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ డిపో లోపల డ్రెయినేజీ కాలువ మొత్తం చెత్తతో నిండి కంపుకొడుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే జేసీబీలను రప్పించి శుభ్రం చేయించారు. బస్టాండు ప్రధాన ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. బస్టాండు ఆవరణమంతా గుంతల మయంగా మారి వర్షపు నీరు నిండి ఉండటాన్ని గమనించి మట్టితో గుంతలను పూడ్చాలని సూచించారు. ప్లాట్‌ఫాంల వద్ద ప్రయాణికులను కలసి సమస్యలపై ఆరా తీశారు. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించక పోతే ఎలా అని ప్రశ్నించారు. అధిక ధరలకు స్నాక్స్ విక్రయిస్తున్న రెండు దుకాణాలను గుర్తించి రూ.25 వేలు జరిమానా విధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి స్టాల్ నిర్వాహకుడు తప్పనిసరిగా దుకాణం ముందు డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేయక పోతే జరిమానా విధించాలన్నారు. ఇకపై పరిస్థితుల్లో మార్పురాకపోతే చర్యలు తప్పవని ఆర్టీసీ అధికారులను హెచ్చరించారు.

దీక్షిత్.. కొట్టాడు ఐఎఫ్‌ఎస్

- యూపీఎస్సీ పరీక్షల్లో సత్తా చాటిన అమరాపురం యువకుడు
- ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 30వ ర్యాంకు కైవసం

అమరాపురం: మండల కేంద్రానికి చెందిన పద్మ, ఈశ్వరప్ప దంపతుల కుమారుడు దీక్షిత్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్)కు ఎంపికయ్యాడు. సోమవారం రాత్రి ఫలితాలు విడుదల కాగా, ఓపెన్ కేటగిరిలో ఏకంగా 30వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. అఖిలభారత సర్వీసులకు మండలం నుంచి ఎంపికైన తొలి యువకుడిగా చరిత్ర సృష్టించాడు.

మధ్య తరగతి కుటుంబం..

పద్మ, ఈశ్వరప్ప దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు మంజునాథ బెంగళూరులో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు దీక్షిత్ చిన్ననాటి నుంచే చదువుల్లో రాణించేవాడు. దీంతో ఈశ్వరప్ప ఎంతకష్టమైనా తన బిడ్డను బాగా చదివించాలనుకున్నాడు. వ్యవసాయంలో నష్టాలు వచ్చినా బిడ్డల చదువులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకున్నాడు. అందుకు తగ్గట్టుగానే దీక్షిత్ చిన్నపటి నుంచే చదువుల్లో బాగా రాణించేవాడు. అమరాపురంలోని స్ఫూర్తి పబ్లిక్ పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్న దీక్షిత్ ఆ తర్వాత ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం హార్టికల్చర్‌లో డిగ్రీ పట్టా తీసుకున్నాడు.

తొలి ప్రయత్నంలో విఫలమైనా...

దీక్షిత్ డిగ్రీ పట్టా తీసుకున్నాక అందరూ ఏదైనా ఉద్యోగం చూసుకోవాలంటూ సలహా ఇచ్చారు. కానీ అతను అప్పటికే కేంద్రం అఖిల భారత సర్వీసులకు నిర్వహించే యూపీఎస్సీ పరీక్షలు రాయాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు, తన సోదరునికి చెప్పి ఢిల్లీకి వెళ్లాడు. అక్కడ కోచింగ్ తీసుకుని యూపీపీఎస్సీ పరీక్ష రాశాడు. అయితే ప్రిలిమ్స్ కూడా దాటలేకపోయాడు. దీంతో అందరూ అతన్ని నిరుత్సాహ పరిచారు. ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న కొద్దిపాటి డబ్బులు అయిపోవడంతో దీక్షిత్ ఆలోచనలో పడ్డాడు. కానీ యూపీఎస్సీని వదలకూడదనుకున్నాడు.

ఇంట్లో ఉంటూ చదువుకుని..

ఢిల్లీలో తీసుకున్న కోచింగ్‌తో దీక్షిత్‌కు యూపీఎస్సీలో ఎలా పరీక్ష రాయాలి, ఇంటర్వ్యూ ఎలా చేయాలో తెలిసింది. దీంతో మరోసారి పరీక్షకు సిద్ధమయ్యాడు. కొన్నిరోజులు అమరాపురంలో ...ఆ తర్వాత బెంగళూరులోని తన సోదరుడు మంజునాథ వద్ద ఉంటూ ప్రిపేర్ అయ్యి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ప్రత్యేకంగా నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేశాడు. మొదటి సారి చేసిన తప్పులు చేయకుండా రోజుకు 16 గంటల పాటు చదివేవాడు. అలా ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పాసయ్యాడు. ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలో నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా వెళ్లి వచ్చాడు. కానీ గట్టెక్కుతానా లేదా అన్న సంశయం..ఎప్పుడు బయట కనబడినా యూపీఎస్సీ ఫలితాలు వచ్చాయా అని దీక్షిత్‌ను అడిగేవారు. దీంతో అతను కూడా ఫలితం కోసం రెండు నెలలుగా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తా గడిపాడు.

కష్టాన్ని మరిపించిన ఫలితం..

యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ కోసం నిర్వహించిన ఇంటర్వ్యూ ఫలితాలు సోమవారం రాత్రి వెల్లడయ్యాయి. ఇందులో దీక్షిత్ ఏకంగా ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 30వ ర్యాంకు సాధించాడు. దీంతో అతని ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.




అమ్మానాన్నకు అంకితం

ఈ ఫలితం మా అమ్మానాన్నకు అంకితం. ఎందుకంటే నేను యూపీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతానని చెప్పగా వారితో పాటు మా అన్న మంజునాథ నన్ను ప్రోత్సహించారు. తొలిసారి విఫలమైనా వెన్నుదన్నుగా నిలిచారు. నాకు ఏ లోటూ రాకుండా చూసుకున్నారు. కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా అఖిలభారత సర్వీసులు కొట్టవచ్చన్నదానికి నేనే ఉదాహరణ. నేను సర్వీసులోకి వచ్చాక నిరుపేద విద్యార్థులకు సాయంగా నిలుస్తా. – దీక్షిత్

హంద్రీ-నీవాపై చర్చకు రా..

- రాయదుర్గం ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సవాల్



ఉరవకొండ: హంద్రీ-నీవా అభివృద్ధి పనులపై ముందుగా ప్రకటించినట్లుగానే నేడు (బుధవారం) బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నాని, దమ్ముంటే చర్చ కోసం ఉరవకొండకు రావాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సవాల్ విసిరారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. హంద్రీ-నీవా కోసం ఏ ప్రభుత్వం ఎంత మేర ఖర్చు చేసిందో, ఎంత మేర పనులు పూర్తి చేసిందో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఉరవకొండ పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న హంద్రీ-నీవా శిలాఫలకాల వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు చర్చకు సిద్ధం కావాలన్నారు. ఎమ్మెల్యే కాలవ రాక కోసం తాను అక్కడే వేచి ఉంటానన్నారు.

కలెక్టరేట్ ఎదుట 102 వాహన డ్రైవర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న 102 వాహన డ్రైవర్లు

అనంతపురం అర్బన్: వేతన బకాయిలు చెల్లించడంతో పాటు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ కలెక్టరేట్ ఎదుట తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102 వాహనాలు) డ్రైవర్ల మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడారు. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లుగా 500 మంది అరబిందో సంస్థ ద్వారా ఆరోగ్యశాఖకు సేవలందిస్తున్నారన్నారు. ఏడేళ్లుగా తమకు కేవలం రూ.8,800 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, గత మూడు నెలలుగా అదీ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీటీసీ పేరిట యాజమాన్యం కట్టాల్సిన పీఎఫ్ వాటానూ ఉద్యోగుల నుంచే మినహాయిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారన్నారు. వేతనాన్ని పెంచి ప్రతి నెలా రూ.18,500 కచ్చితంగా ఇవ్వాలన్నారు. తన వాటా పీఎఫ్‌ను యాజమాన్యమే చెల్లించాలన్నారు, చట్టప్రకారం సెలవులు అమలు చేయాలన్నారు. ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదంలో మరణిస్తే ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలు చెల్లించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సాయిచరణ్, కోశాధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ANANTAPURAMU MUNICIPAL CORPORATION		
e-PROCUREMENT - TENDER NOTICE		
1	Tender Notice No.	39 to 65/2025-26 / General Funds / EE/TO
2	Scope of Work	Desiltation of drains S&D of Liquid Chlorine Gas & Construction of CC Road.
3	No. of Works	27 No. of Works
4	Estimate Cost Ranging	Rs. 1.20 to 12.50

Note: The details of tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner
Municipal Corporation, Anantapuramu

'సూపర్' సేవలు మెరుగు పడాలి

- డీఎంఈ నరసింహం



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో స్పెషాలిటీ సేవలు మరింత మెరుగుపడాలని సంబంధిత వైద్యాధికారులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం సూచించారు. మంగళవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. రోగులకందుతున్న సేవలు, రోజూ ఎన్ని శస్త్రచికిత్సలు చేస్తున్నారు, తదితర అంశాలపై ఆరా తీశారు. రోగుల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆ దిశగా వారిలో నమ్మకం కల్గించేలా చూడాలన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతం చేసి త్వరలో అందుబాటులో తీసుకురావాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల వైద్యులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. ప్రధానంగా సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం బోధనాస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనపై జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు వినతి పత్రం అందించారు. పరికరాలు, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించేలా చూడాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

గార్లదిన్నె: ప్రధాని నరేంద్రమోదీపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... కల్లూరుకు చెందిన మహబూబ్‌బాషా సోషల్ మీడియాలో దేశ ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన పోస్టులు పెట్టాడన్నారు. దీనిపై ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రేషనలైజేషన్‌తో తీవ్రంగా నష్టపోతున్నాం



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్య వివరిస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

అనంతపురం అర్బన్: ప్రభుత్వం చేపడుతున్న రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా తీవ్రంగా నష్టపోతామని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ వద్ద అసోసియేషన్ ఆఫ్ సెక్రటరీయేట్ రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ బాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మైలారప్ప, పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు అఖిల్‌కుమార్, తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అన్ని శాఖల్లో విలీనం చేసి ప్రమోషన్ ఛానల్ కల్పించాలని ప్రభుత్వం చేపడుతున్న రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా చాలా నష్టపోతామన్నారు. ఈ ప్రక్రియలో రెండు లేదా మూడు సచివాలయాలను క్లస్టర్‌గా చేస్తున్నారన్నారు. దీంతో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, మైనర్ ఇరిగేషన్, పంచాయతీ ఇలా అన్ని శాఖల పనులు ఒకేసారి చేయాల్సి వస్తుందన్నారు. దీంతో ఒత్తిడి పెరిగి పనిలో నాణ్యత లోపిస్తుందన్నారు. ఈ క్రమంలో చోటు చేసుకునే తప్పిదాలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బాధ్యులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శ్రీకాంత్, కులశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విచారణకు 33 మంది ఎల్‌టీల హాజరు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న విచారణాధికారులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ)లో ల్యాబ్ టెక్నీషియన్ల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం చేపట్టారు. బోధనాస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి సంబంధించి నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. 35 మందికి గాను 33 మంది హాజరయ్యారు. విచారణ కమిటీ సభ్యులుగా డాక్టర శ్యామ్, డాక్టర్ రామస్వామి, డాక్టర్ ఆది నటేష్ వ్యవహరించారు.

భార్య దాడిలో భర్త మృతి

- హత్య కేసుగా మార్పు

అనంతపురం: భార్య దాడిలో గాయపడిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ నమోదైన దాడి కేసును హత్య కేసుగా పోలీసులు మారుస్తూ రిమాండ్‌లో ఉన్న నిందితురాలిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వివరాలను అనంతపురం నాల్గో పట్టణ సీఐ కనుమూరి సాయినాథ్ మంగళవారం వెల్లడించారు. అనంతపురంలోని విద్యారణ్యనగర్ ఉర్దూ స్కూల్ సమీపంలో నివాసముంటున్న సయ్యద్ ఇస్మాయిల్ రెండో కుమారుడు షాజహాన్ (45)కు తాడిపత్రికి చెందిన సపోరాతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబకలహాల నేపథ్యంలో ఆరేళ్ల క్రితం దంపతులు విడిపోయారు. అదే సమయంలో షాజహాన్‌కు హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన ఈశ్వరమ్మతో పరిచయమైంది. అనంతపురంలోని కోవూర్ నగర్‌లో ఇమ్రాన్ మసీదు వద్ద అద్దె ఇంట్లో ఇద్దరూ సహజీవనం సాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే మూడేళ్ల క్రితం ఈశ్వరమ్మను షాజహాన్ పెళ్లి చేసుకున్నాడు. వీరికి 14 నెలల వయసున్న హమీల్‌బాబా అనే కుమారుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా షాజహాన్ మొదటి భార్య కుమారుడు తరచూ ఇంటికి వచ్చి వెళ్లేవాడు. దీంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. తన కుమారుడి రాకను ఆక్షేపిస్తుండడంతో ఈ నెల 1న రాత్రి షాజహాన్ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని ఈశ్వరమ్మతో గొడవపడ్డాడు. ఆ సమయంలో ఈశ్వరమ్మ రోకలి బండ తీసుకుని షాజహాన్ తలపై మోదింది. తీవ్ర రక్తస్రావమవడంతో అదే రోజు రాత్రి 11 గంటలకు సర్వజనాస్పత్రికి షాజహాన్‌ను తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాస్త కోలుకున్న తర్వాత ధర్మవరంలోని చెన్నకేశవపురంలో ఉన్న సోదరుడి ఇంటికి షాజహాన్ చేరుకుని వైద్యుల సూచన మేరకు రోజూ క్రమం తప్పకుండా చికిత్స కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కాగా, దాడి జరిగిన సమయంలో షాజహాన్ తండ్రి సయ్యద్ ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈశ్వరమ్మపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేసి, ఈ నెల 3న అదుపులోకి తీసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆమె రిమాండ్ ఖైదీగా ఉంది. తాజాగా ఈ కేసును హత్య కేసుగా మారుస్తూ న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

'కూటమి' అరాచకాలకు భయపడొద్దు

- శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజనాథ్

పుట్లూరు: కూటమి ప్రభుత్వ అరాచకాలకు భయపడాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఆ పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ భరోసానిచ్చారు. పుట్లూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. సమావేశంలో శైలు మాట్లాడారు. నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ప్రతి మండలంలో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై బెదిరింపులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమష్టి కృషి, ప్రజల ఆశీర్వాదంతో మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాఘవ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూలో బది'లీలలు'

- ప్రక్రియ నిర్వహణలో ప్రతిసారీ తిరకాసు
- ఈసారైనా నిబంధనలు అమలవుతాయో.. లేదో

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో బదిలీల వ్యవహారమంతా ఇప్పటి వరకూ ఓ మాయగానే ఉంటోంది. ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు నిబంధన ఈ శాఖలో మచ్చుకైనా కనిపించడం లేదు. బదిలీలు నిర్వహించిన ప్రతిసారీ ఇదే తీరు స్పష్టంగా కనిపిస్తోంది. అనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు బదిలీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోనే తిష్ట వేస్తున్నారు. కలెక్టరేట్ లేదా ఆర్‌డీఓ లేదా తహసీల్దారు కార్యాలయం, జిల్లా పౌర సరఫరాల శాఖ... ఇలా కార్యాలయం మార్పు తప్ప ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఆనవాళ్లు లేవు. అయితే అందరి విషయంలోనూ ఇలాగే ఉంటుందా? అని ప్రశ్నించుకుంటే కాదనే సమాధానమూ వినిపిస్తోంది. బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగానే 'మేనేజ్' చేసుకోలేని వారు 'విసిరేసిన' చోటికి వెళ్లాల్సి వస్తోంది.

జిల్లా కేంద్రాన్ని పట్టుకుని వేలాడుతూ..

రెవెన్యూ శాఖలో ఎన్ని దఫాలు బదిలీ (స్థాన చలనాలు)లు జరిగిన పలువురు సిబ్బంది జిల్లా కేంద్రాన్ని పట్టుకునే వేలాడుతున్నారు. వీరు కార్యాలయం మారుతున్నారు తప్ప హెడ్‌క్వార్టర్‌ను వీడడం లేదు. జూనియర్ అసిస్టెంట్ల మొదలు డిప్యూటీ తహసీల్దార్ల వరకూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. కొందరైతే స్థాన చలనాలు ద్వారా ఏకంగా 15 నుంచి 20 ఏళ్లుగా ఇక్కడిక్కడే కార్యాలయాలు మారుతున్నారు. ఇక వీఆర్‌ఓల పరిస్థితి మరోలా ఉంది. మండలం కేంద్రంగా కాకుండా గ్రామం ఆధారంగా బదిలీలు పొందుతున్నారు. బదిలీల సమయంలో మండలాన్ని కేంద్రంగా తీసుకుని బదిలీ చేయాల్సి ఉంటుంది. అయితే అలా కాకుండా అదే మండలంలో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి బదిలీ అవుతుండడం గమనార్హం.

ప్రస్తుత బదిలీల్లోనైనా...

ప్రభుత్వం జూన్ 2వ తేదీ వరకు బదిలీలకు అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్లో 'ఐదేళ్లు ఒకే స్టేషన్' లో పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి అనే నిబంధన ఉంది. ఈ దఫా అయినా ప్రభుత్వ నిబంధనను అధికారులు అమలు చేస్తారా? లేదో?ననే అనుమానాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పామిడి: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ భార్య లక్ష్మీదేవి (25) తన సోదరుడు వీరాతో కలసి ఇల్లూరులో మంగళవారం జరిగిన ఊరి దేవరకు హాజరయ్యారు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు పామిడి మండలం కట్టకిందపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవిని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది.

- హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ్మూర్తి (64) కోయంబత్తూరులోని ఈషా టెంపుల్ దర్శనానికి ఓ ప్రైవేట్ బస్సులో బయలుదేరాడు. మంగళవారం సాయంత్రం పామిడి మండలం రామరాజుపల్లి వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ హోటల్ వద్ద టీ బ్రేక్ కోసం బస్సును డ్రైవర్ ఆపాడు. దీంతో శ్రీరామ్మూర్తి బస్సు దిగి ప్రహరీకి అవతలి వైపుగా చేరుకుని మూత్ర విసర్జన చేస్తుండగా ఆరంజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సును డ్రైవర్ రివర్స్ చేస్తూ ప్రహరీని ఢీకొన్నాడు. దీంతో ప్రహరీ కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకున్న శ్రీరామ్మూర్తిని వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందజేస్తుండగానే పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అధికారులే టో(తో)లు తీశారు!

- అద్దె బస్సులతో ఆర్టీసీకి రూ.కోట్లలో నష్టం
- లోకల్ రిజిస్ట్రేషన్ ఉండాలన్న ప్రధాన నిబంధన తుంగలోకి
- నాన్‌లోకల్ వాహనాలు కావడంతో టోల్ ఫీజు చెల్లింపునకు వర్తించని రాయితీ



అనంతపురం క్రైం: ఆర్టీసీ ఆదాయానికి అధికారులే గండి కొట్టారు. సంస్థను లాభాల్లో నడిపించాల్సింది పోయి జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యతనిచ్చారు. ఫలితంగా ఈ రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.వందల కోట్ల నష్టాన్ని ఆర్టీసీ చవిచూడాల్సి వచ్చింది.

అద్దె బస్సుల టెండర్లలో కీలక నిబంధన గాలికి

ఆర్టీసీకి ఖర్చు తగ్గించి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో అద్దె బస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆన్‌లైన్ టెండరు నిర్వహించారు. టెండరులో పాల్గొనే వాహన యజమానులకు 200పై చిలుకు నిబంధనలు విధించారు. ఇందులో 1 నుంచి 10 వరకు కీలక షరతులు ఉన్నాయి. ప్రధానంగా అద్దెకు ఇచ్చే బస్సు ఏ జిల్లాలో అయితే నడుపుతారో ఆ జిల్లాలోనే రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. ఇక్కడే అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. జిల్లాలో 100కు పైగా అద్దె బస్సులను తిప్పుతున్నారు. ఇందులో 70కి పైగా అద్దె బస్సులు ఇతర జిల్లాల్లో రిజిస్ట్రేషన్ చేయించినవి కావడం గమనార్హం. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), రీజనల్ మేనేజర్ (ఆర్‌ఎం) ఉదాసీన వైఖరి కారణంగా అద్దె బస్సుల టెండర్ ఖరారులో కీలక నిబంధన కాస్త కనుమరుగైంది. ఈడీ అలాంట్‌మెంట్ ఆర్డరు ఇచ్చినప్పుడు అద్దె బస్సుకు లోకల్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధనను పొందుపరిచినప్పటికీ జిల్లా స్థాయి అధికారి తుంగలో తొక్కి 9 ఏళ్ల కాల వ్యవధితో అద్దె ప్రాతిపదికన బస్సులు నడిపేలా ఇతర జిల్లాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు అనుమతులు ఇచ్చేశారు. ఈ అనుమతుల జారీ వెనుక సదరు జిల్లా స్థాయి అధికారి భారీగా ముడుపులు దండుకున్నట్లుగా సంస్థ ఉద్యోగులే బాహాటంగా పేర్కొనడం గమనార్హం.

సంస్థకు చేకూరిన నష్టమిలా..

లోకల్ రిజిస్ట్రేషన్ అయిన అద్దె బస్సులను ఆర్టీసీ నడిపితే టోల్ ఫీజులో రాయితీ వర్తిస్తుంది. 30 రోజుల పాటు ఒక బస్సు రోజుకు 366 కిలో మీటర్లు తిరిగితే నెలకు రూ.50 వేలు టోల్‌ఫీజు చెల్లించాలి. లోకల్ వాహనమైతే రూ.25 వేలతో సరిపోతుంది. కాగా నాన్‌లోకల్ వాహనం కావడంతో నెలకు అదనంగా ఆర్టీసీ రూ.25 వేలు చెల్లించాల్సి వచ్చింది. ఈ లెక్కన ఒక అద్దె బస్సుకు రెండేళ్లలో టోల్ ఫీజు కింద అదనంగా రూ.6 లక్షలను ఆర్టీసీ చెల్లించింది. ఇలా జిల్లాలో నాన్‌లోకల్ కింద రిజిస్ట్రేషన్ కలిగిన 70కి పైగా అద్దె బస్సులకు అనంతపురం ఆర్టీసీ రీజియన్ పరిధిలో సంస్థ రూ.4.20 కోట్లు నష్టపోయింది.

నష్టాన్ని గుర్తించిన చిరుద్యోగి

లోకల్ రిజిస్ట్రేషన్ లేకపోవడంతో అనంతపురం ఆర్టీసీ రీజియన్ పరిధిలో అద్దె బస్సులకు టోల్‌ఫీజు రాయితీ కోల్పోతోందనే విషయాన్ని ఓ చిరుద్యోగి గుర్తించారు. ఈ విషయాన్ని తన కార్యాలయంలోని ఆర్‌ఎంకు వివరించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న సదరు అధికారి మాత్రం కిమ్మనకుండా చేతులెత్తేశారు. కాగా, ఈ సమస్యను సదరు ఉద్యోగి గుర్తించి నేటికి ఆరు నెలలు కావస్తోందని సమాచారం. అకౌంట్ సెక్షన్ ఏం చేస్తోందంటూ తొలుత ఆర్‌ఎం హంగామా చేసినా క్రమేణా ఆ ఊసే ఎత్తకుండా మిన్నకుండిపోయారు. కాగా ఈ విషయం తెలుసుకున్న జిల్లాలోని ఓ డిపోలో అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగి ఈ సమస్య తన తలకు ఎక్కడ చుట్టుకుంటుందోనని భయపడి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కోరుతూ ఆర్‌ఎంకు లేఖ ఇచ్చినట్లుగా సమాచారం.

ఇప్పటికీ అదే నిర్లక్ష్యం

ఆరు నెలల క్రితమే ఓ చిరుద్యోగి జరుగుతున్న నష్టాన్ని పసిగట్టి సంస్థ ఏడాదికి ఎంత మేర నష్టపోతుందో గణాంకాలతో వివరించినా.. చర్యలు తీసుకోవడంలో అధికారులు మీన మేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. సదరు అద్దె బస్సుల యజమానులకు నోటీసులు జారీ చేసి ఇప్పటికైనా నష్టాన్ని పూడ్చాలని సలహా ఇచ్చిన పాపానికి ఉన్నతాధికారులు అందరూ ఏకమై విషయాన్ని తొక్కి పెట్టినట్లు సమాచారం. సమస్య గుర్తించిన తక్షణమే చర్యలు తీసుకుని ఉంటే ఈ ఆరు నెలల్లో రూ. కోట్లలో నష్టాన్ని అరికట్టి ఉండవచ్చు. అయినా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

క్లుప్తంగా

మాంఛో ఫెర్రర్‌ను కలిసిన దివ్యాంగ సంఘాలు



మాంఛో ఫెర్రర్‌కు బొకే అందిస్తున్న దివ్యాంగ సం ఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని దివ్యాంగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను పలు దివ్యాంగ సంఘాల నాయకులు కలిశారు. ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ అనంత దివ్యాంగుల వెన్నెముక 'ఆర్డీటీ సంస్థ' అన్నారు. వేలాది మంది దివ్యాగుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ మంజూరు చేయాలని ఆకాంక్షిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్, కార్యదర్శి రాజేష్, కళ్యాణదుర్గం మండల అధ్యక్షుడు చెన్నమలప్ప, న్యాయ సలహాదారు జెన్నే ఆనంద్, సుధాకర్, ఎమ్మార్పీఎస్ నేత లక్ష్మన్న పాల్గొన్నారు.

రేపు నగరానికి విధుశేఖరభారతీ తీర్థులు

అనంతపురం కల్చరల్: శృంగేరీ మఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి వారు ఈనెల 22న అనంతకు రానున్నట్లు శంకర మఠం మేనేజర్ సత్యప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం స్వామీజీ శృంగేరీ శంకర మఠానికి విచ్చేసి చంద్రమౌళీశ్వర పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలతో పాటూ అనుగ్రహ భాషణం, అనంతరం భక్తుల పాదపూజలు, దర్శనం ఉంటాయని తెలియజేశారు.

రక్షణ రంగానికి విరాళం అభినందనీయం

• కలెక్టర్ వినోద్‌కుమార్



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చెక్ అందజేస్తున్న హరిశ్చంద్ర ఘాట్ కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: రక్షణ రంగానికి విరాళం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ హరిశ్చంద్రఘాట్ కమిటీ సభ్యులను అభినందించారు. దేశ త్రివిధ దళాలకు అండగా నిలవడంలో భాగంగా స్థానిక గుత్తిరోడ్డు హరిశ్చంద్ర ఘాట్ కమిటీ తమవంతుగా ప్రధానమంత్రి సహాయ నిధికి రూ.1,01,116 విరాళం ఇచ్చింది. కలెక్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కమిటీ సభ్యులు కలిసి చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు అవ్వాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్, ప్రధాన కోశాధికారి దూపకుంట్ల సాయినాథ్ గుప్త, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, ఆలయ ధర్మకర్త గర్లాల నాగరాజు, జైన సంఘం హర్షద్ జైన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రూరల్ కమిటీ ఎన్నిక



మారుతీప్రసాద్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న సంఘం నాయకులు

అనంతపురం రూరల్: స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ, ఎన్నికల అధికారులు వేణుగోపాల్, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ కమిటీ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మారుతిప్రసాద్, జనరల్ సెక్రటరీగా మురళీకృష్ణ, ట్రెజరర్ అలేఖ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శివప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా అరుణమ్మ, డాక్టర్ మనోజ్ కుమార్‌లతో పాటు మరికొంతమందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మారుతీప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

వీఆర్వోలను కుదించొద్దు

ఆత్మకూరు: ప్రభుత్వం వీఆర్వోలను కుదించేందుకు సిద్ధమవుతోందని, అలా చేస్తే తమకు పని భారం పెరుగుతుందని వీఆర్వోలు పేర్కొన్నారు. వీఆర్వోలను కుదించే ఆలోచన విరమించుకోవాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ లక్ష్మినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా 11 సచివాలయాలు ఉన్నాయని సచివాలయానికి ఒక వీఆర్వోగాని లేదా రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో గాని ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు మల్లికార్జున, శ్రీలక్ష్మి,రాజశేఖర్, రఫి, ప్రసాద్, జయన్న తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్ మెయిన్ రోడ్డుపై భారీ గుంత పడడంతో వాహనదారుల అవస్థలు



బళ్లారి బైపాస్ రోడ్డుపై చేరిన వర్షపునీరు

నరకానికి నకళ్లు!

నగరంలో రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. అడుగడుగునా గుంతలు పడటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు ప్యాచ్ వర్కులు చేపట్టామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప రోడ్లను బాగు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. రోడ్లపై గుంతలు ఉండటం, ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నగరంలో రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



గుంతలు పడిన తపోవనం రోడ్డు



మారుతీనగర్ రోడ్డు దుస్థితి ఇలా



రంగస్వామి నగర్ రోడ్డు దుస్థితి ఇలా



నీటి మడుగును తలపిస్తున్న మంగళవారి కాలనీ రోడ్డు



రామ్‌నగర్ పార్కు లైన్‌లో రోడ్డు దుస్థితి

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

• కమిషనర్ బాలస్వామి



మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని కమిషనర్ బాలస్వామి నగరపాలక సంస్థ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలను కమిషనర్ పరిశీలించారు. కొందరు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, నోడల్ ఆఫీసర్లు కన్పించకపోవడంతో కమిషనర్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన స్థానాల్లో ఉండి పని చేయాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటన పేరుతో విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదన్నారు. వారంలో రెండ్రోజుల పాటు తనిఖీ చేస్తామన్నారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. గ్రీవెన్సెస్‌ను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఎస్‌ఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలకు సంపూర్ణ మద్దతు

అనంతపురం టవర్‌క్లాక్: సమస్యలపై పోరాడుతున్న ఉపాధ్యాయ సంఘాలకు ఆర్‌ఈఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆర్‌ఈఎఫ్(రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్ ప్రకటించారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, పదోన్నతుల్లో సమస్యలపై పోరాడుతున్న ఉపాధ్యాయ సంఘాలకు అండగా నిలుస్తామన్నారు. తక్షణం విద్యాశాఖ మంత్రి స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు నాగభూషణం, శ్రీనివాసులు, ఓబులేసు, మర్రిస్వామి, రాజశేఖర్, ఉమా శంకర్, మల్లికార్జున, నారాయణప్ప, రాజా రమేష్, నాగభూషణం, ఆదినారాయణ, వరద రాజులు, రాఘవేంద్ర రావు, మహేష్ నాయక్, రామాంజనేయులు, రామకృష్ణ, భీమేశ్వరయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోవాలాకు జరిమానా విధిస్తున్న పోలీసులు

అనంతపురం: అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని కూడళ్లలో వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. మైనర్లు వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కావున తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని పోలీసులు తెలియజేశారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంకెన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనలకు జరిమానాలు విధించాలని ఆదేశించారు.

డీఈఐసీ పరిశీలన

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. డీఈఐసీలో చిన్నారులకు అందుతున్న సేవలు, చికిత్స గదులు, తదితర వాటిని ఆయన పరిశీలించారు. డీఈఐసీలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో మంగళవారం గేదె మృతి చెందింది. రైతు ఓబుగారి సుబ్బిరెడ్డి ఉదయం మేత కోసం రెండు గేదెలను గ్రామ నడిబొడ్డున ఉన్న బయలు ప్రాంతానికి వదిలాడు. ఒక గేదె సమీపంలో ఉన్న విద్యుత్ స్థంభం స్టే వైర్‌ను తాకింది. స్టేవైర్‌కు విద్యుత్ ప్రసరించడంతో గేదె షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

'తోపుదుర్తి'ని విమర్శించే స్థాయి మీకు లేదు

• పరిటాల సునీత, ధర్మవరపు మురళీ ప్రోద్బలంతోనే రైతు దంపతుల హత్య
• వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, నాయకులు

రాప్తాడు: మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదని మండల టీడీపీ నాయకులపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మాజీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడారు. ఈ నెల 17న గంగలకుంట పొలంలో చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులను టీడీపీ నాయకులు అంత్యంత కిరాతంగా వేటకొడవళ్లతో నరికి చంపడం చాలా దుర్మార్గామన్నారు. ఇవి ముమ్మాటికీ ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె సోదరుడు ధర్మవరపు మురళీ ప్రోద్బలంతోనే జరిగాయని ఆరోపించారు. ఈ నెల 19న కొంత మంది టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని రెచ్చగొట్టేలా ఆయన పైన దూషణలకు దిగడం సరికాదన్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత వారికి లేదన్నారు. వారు ప్రెస్‌మీట్‌లో చిగిచెర్ల నారాయణ రెడ్డి తమ పార్టీ నేతని, పరిటాల రవి వర్ధంతి, జయంతి వేడుకలకు వస్తున్నాడని చెబుతున్నారని, ఆ పార్టీ నాయకుడైతే వారు చంపొచ్చా అని ప్రశ్నించారు. దాయాదుల సమస్య అని చెబుతున్నారని, అలాంటి వాటిలోకి టీడీపీ నేతలు వెళ్లి ఎందుకు చంపారని నిలదీశారు. పరిటాల సునీత ఎమ్మెల్యేగా గెలినప్పటి నుంచి టీడీపీ నాయకులు హత్యలు చేస్తూనే ఉన్నారన్నారు. రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో భూమిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, కందుకూరులో శివారెడ్డి, పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య హత్యలే నిదర్శనమన్నారు.

హత్యలు, దౌర్జన్యాలకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే సునీత నియోజవర్గంలో హత్యలు, దౌర్జన్యాలను పోత్సహిస్తున్నారని విమర్శించారు. ఎవరూ గొడవలకు పోవద్దని, రైతు దంపతులను హత్య చేసిన టీడీపీ నేతలు కూడా నాలుగైదు ఏళ్ల తర్వాత తప్పకుండా శిక్ష పడి జైలుకు వెళ్లడం తప్పదన్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఆయన తోపా అన్ని ప్రశ్నిస్తున్నారని, ఐదేళ్లలో రెండేళ్లు కరోనా వచ్చినా కూడా మూడేళ్లలో ఆయనఎంత అభివృద్ధి చేశారో మీ ఆత్మసాక్షిని ప్రశ్నించుకోవాలన్నారు. మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి, నాయకులు సింగారప్ప, రవికుమార్, నరసింహారెడ్డి, గోవింద్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తులకు తిప్పలు



రేషన్ కార్డుల దరఖాస్తు ఆన్‌లైన్ కోసం రెవెన్యూ కార్యాలయంలో వేచి ఉన్న లబ్ధిదారులు



సర్వర్ పని చేయకపోవడంతో టేబుల్‌పై ఉంచిన రేషన్‌కార్డుల దరఖాస్తులు

• పని చేయని సర్వర్లు
• ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులు

ఆత్మకూరు: కొత్తరేషన్ కార్డుల మంజూరు, కార్డుల్లో మార్పులు, చేర్పులు, కార్డు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ పని చేయకపోవడంతో సచివాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మండలంలో 11 సచివాలయాల్లో ప్రక్రియ కొనసాగుతోంది. రేషన్ కార్డులకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసి లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించిన తరువాత వీఆర్వో లాగిన్‌కు పంపించాల్సి ఉంది. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 12,197 రేషన్ కార్డులు ఉన్నాయి.

పని చేయని సర్వర్..రోజుకు రెండు.. మూడు దరఖాస్తులే..!

మండల వ్యాప్తంగా వేల సంఖ్యలో రేషన్ కార్డులకు దరఖాస్తుదారులు ఉన్నప్పటికీ సర్వర్లు పని చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల వద్ద వేచి చూసినా సర్వర్లు పని చేయకపోవడంతో పని జరగలేదంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుందుకు ఈ నెల మెదటి వారంలోనే సైట్ వదిలినా కేవలం రోజుకు రెండు,. మూడుకు మించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని డిజిటల్ అసిస్టెంట్లు పేర్కొంటున్నారు. పని వేగంగా చేయాలంటే సర్వర్లు ఉండాలని, సర్వర్‌లే పని చెయ్యకపోతే పని ఎలా చేయాలంటూ వాపోతున్నారు.

గడువు ముగుస్తుందన్న భయం

రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియకు నెల రోజులు మాత్రమే గడువు ఉండటం, సచివాలయాల్లో పని జరగకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. రోజుకు రెండు, మూడు దరఖాస్తులే ఆన్‌లైన్ అవుతుండటంతో ఎలా దరఖాస్తు చేసుకోవాలంటూ లబ్ధిదారులు మండిపడున్నారు. ఈ విషయంపై సీఎస్‌డీటీ లక్ష్మిదేవిని వివరణ కోరగా సర్వర్ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, సర్వర్లు పని చేసే సమయంలో వెంటనే దరఖాస్తులు చేస్తున్నారని ఆమె తెలియజేశారు.

నిర్వి'రామ' భజన



కోలాటం ఆడుతున్న మహిళలు



పూజలందుకున్న ఆంజనేయుడు

అనంతపురం కల్చరల్: హౌసింగ్ బోర్డులోని నిలువెత్తు భక్తాంజనేయస్వామి ఆలయంలో ఉదయం హనుమజ్జయంతి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిలువెత్తు భక్తాంజనేయుడికి చందన అలంకారం, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. 108 మంది దంపతులతో హనుమద్ వ్రతం భక్తిశ్రద్ధలతో సాగింది. సాయంత్రం 1000 మందితో కలిసి భజన బృందాల వారు 11 సార్లు శ్రీహనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ విజయతారక మంత్రం 24 గంటల పాటూ నిర్విరామంగా సాగుతుందని ఆలయ నిర్వాహకుడు పరుచూరు రమేష్ తెలిపారు. భక్తులు మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలనందుకున్నారు.


అధినేతతో రామగిరి ఎంపీటీసీల భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రామగిరి ఎంపీటీసీ సభ్యులు

రామగిరి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన రామగిరి మండల ఎంపీటీసీ సభ్యులు మంగళవారం కలిశారు. రామగిరి ఎంపీపీ స్థానాన్ని అడ్డదారుల్లో దక్కించుకునేందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత సాగిస్తున్న కుట్రను భగ్నం చేస్తూ ఎన్నికకు ఎంపీటీసీలందరూ గైర్హాజరైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రామగిరి మండలంలో నెలకొన్న పరిస్థితులను వారు వైఎస్ జగన్‌కు వివరించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీటీసీ సభ్యులు సుజాతమ్మ, భారతి, వెంకటలక్ష్మమ్మ, ఆదిలక్ష్మి, బాలకొండయ్య, సాయిలీల, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, శంకరయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

దేశ సంపద కార్పొరేట్లకు ధారాదత్తం



ఆందోళన నిర్వహిస్తున్న కార్మిక నేతలు

అనంతపురం సిటీ: 'ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశభక్తి ముసుగులో కార్పొరేట్లకు దేశ సంపదను ధారదత్తం చేస్తున్నారని కార్మిక సంఘాల ప్రతినిధులు దుయ్యబట్టారు. నగరంలోని బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్, తపాలా కార్యాలయాల ఎదుట వైఎస్సార్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ(కొత్త), రైతు వ్యవసాయ కూలీ సంఘాల ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నగర కార్యదర్శులు ముత్తుజా, కృష్ణుడు నాయకత్వం వహించగా.. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, రాజారెడ్డి మాట్లాడారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నీరుగార్చడం దుర్మార్గమన్నారు. మూడు నల్లచట్టాలు, నాలుగు లేబర్ కోడ్లతో కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారన్నారు. దేశ భవిష్యత్తు, నిరుద్యోగ సమస్య పరిష్కారం, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, రైతు వ్యతిరేక విధానాలను సమ్మెల ద్వారా అడ్డుకుంటామన్నారు. హక్కులను సాధించుకునేందు కోసం జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్మిక విభాగాల ప్రతినిధులు వేణు, రాజేష్, నాగేంద్ర, కిశోర్, ఏసు, రత్నం, నాగభూషణ, లతీఫ్, చంద్రశేఖర్, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

రాప్తాడు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో 42వ జాతీయ రహదారిపై సీఐటీయూ, రైతు సంఘం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు భంగం కలిగించే 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు.రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మయ్య, హమాలీలు లక్ష్మీనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులపై దాడులు అరికట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో రోజురోజుకు దళిత, గిరిజనులపై దాడులు తీవ్రమవుతున్నాయని, తక్షణం వాటిని అరికట్టాలని జీవీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం రూరల్‌లోని పాలవాయి, చాపిరి తండాలో గిరిజనులపై కులం పేరుతో దుషించి దాడులకు పాల్పడ్డారన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులను తక్షణం అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లు, హైకోర్టుని ఆశ్రయించి బాధితులకు న్యాయం జరిగే దాకా పోరాడతామన్నారు. నాయకులు మనోజ్ కుమార్, ప్రసాద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.